

# జాగరణ

బి. అజయ్‌ప్రసాద్

పడమట సూర్యుడు కొండలమాటుకి దిగిపోగానే తూర్పున పౌర్ణమి చంద్రుడు దిగంతం నుంచి పైకి లేచాడు. పగలంతా ఎండకు కాగిన చెట్లు సాయంత్రపు చల్లటి గాలికి తలలూపుతూ ఉన్నాయి. నల్లటి పిట్టలు రెక్కలు విప్పుకుని గిరికీలు కొడుతూ గూళ్లకు చేరుకుంటున్నాయి.

చీకట్లు ముసురుకునే వేళ వరకు పగలంతా భిక్షాటనకు ఊరంతా తిరిగి జోలె నింపుకుని ఎప్పటి లానే తార్రోడ్డు నుంచి ఊరి చివరకు దారితీసే కాలిబాట పట్టాడు బైరాగి. అతడి ఒంటి మీద ఉన్న కాషాయ వస్త్రాలు నలిగి, మాసి మట్టిరంగులోకి మారిపోయి ఉన్నాయి. నల్లగా, బక్కగా ఎండిపోయిన కొమ్మలా ఉన్నాడతను. చెమటకి నుదుటి మీది విభూతి, కుంకుమ చెరిగిపోయి ఉన్నాయి. నలుపు తెలుపు కలగలిసిన పొడవాటి గెడ్డం సాయంత్రపు ఎండలో అతడి నీడతో పాటు నడుస్తూ ఉంది.

పగలంతా మనుషులు ఒక ఊరి నుంచి మరొక ఊరికి నడుచుకుంటూ వెళ్లే కాలిబాట పొద్దుగూకే కొద్దీ నిశ్శబ్దమవుతూ ఉంది. బైరాగి కాలిబాట దాటి ఊరి చివర గుబురు చెట్ల మధ్య సగానికి కూలిపోయి ఉన్న ఇంట్లోకి అడుగుపెట్టేసరికి పూర్తిగా చీకటిపడింది.

ఎప్పుడైనా కొత్తవాళ్లు, పొరుగూరు వెళ్లే బాటసారులు కాలిబాట నుంచి నడిచిపోతూ కూలిపోయిన ఆ ఇంటిని వింతగా చూసేవారు. ఒక్కోసారి పనీపాటా లేని సోమరులు మొండిగోడల నీడ పట్టున కూర్చుని పులిజూదం ఆడేవారు. కొత్తవారు ఎవరొచ్చినా బైరాగి పట్టించుకునేవాడు కాదు. వచ్చినవారు ఒకటి రెండు రోజులకే అక్కడి నిశ్శబ్దానికి విసుగొచ్చి వెళ్లిపోయేవారు.

అతను ఆ పాడుబడ్డ ఇంట్లో ఎంతకాలం నుండి ఉంటున్నాడో ఎవరికీ తెలియదు. రోజుల తరబడి ఒంటరిగానే ఉంటాడు. వీపు గోడకు ఆనించి శూన్యంలోకి చూస్తూ నిశ్శబ్దంగా గడిపేస్తాడు. ఒక్కోసారి తనలో తనే మాట్లాడుకుంటూ అరచేతులు గాలిలోకి చాపి వేళ్ల వంక దృష్టి నిలిపి విచిత్రంగా అరిచి చేతులు వెనక్కి లాక్కుంటాడు. ఆ చేష్టల్ని చూసే అతడొక విచిత్రమైన సాధువని చెప్పుకుంటుంటారు.

బైరాగి ఇంట్లోకి రాగానే దీగుడు లోపల కిరసనాయిలు దీపం ముట్టించి గదిలో ఒకవార గంప కింద ఉన్న పావురాన్ని బయటకు తీసి దాని ముందు నూకలు చల్లాడు. ఆ తరువాత ఆరుబయట చిదుగులతో పొయ్యి ముట్టించి ఎసరుపెట్టి లోపలికి వచ్చి చింకిచాప మీదకి ఒరిగాడు. గది లోపలి వైపుకు సగానికి కుంగిన రెల్లుగడ్డి కప్పు చీకట్లోకి తెరుచుకుని ఉంటే బయట వాకిలి నానుకుని కొమ్మల్ని చాచిన దిరిశెనచెట్టు లోపలికి చూస్తూ ఉంది. ఎవరెవరో బొగ్గుతో రాసిన పిచ్చి గీతలతో మసిబారిన మొండిగోడలు నిశ్శబ్దంగా నుంచుని ఉన్నాయి. గాలికి ఎప్పుడు ఆరిపోయిందో పొయ్యి, కొంతసేపు సన్నటి పొగ వచ్చి తరువాత చల్లబడిపోయింది.

“అప్పుడే పడుకునేసినావా సావి,” అన్న పిలుపుతో బైరాగి నిద్ర నుంచి లేచినట్లు ఉలిక్కిపడి లేచి చూశాడు. బయట వరండాలో అరుగు మీద గురిగాడు కూర్చుని ఉన్నాడు. అతడి పక్కనే గుల్లకమ్మలో కొట్టిన గూడకొంగలు దాహంతో నోరు తెరిచి ఒగరుస్తూ

ఉన్నాయి. వాటి కాళ్లు మెలిపెట్టి నులక దారంతో కట్టి పడేసి ఉన్నాయి. వాకిలి ముందు చల్లారిపోయిన పొయ్యి మీద మూకుడు స్తబ్ధంగా కూర్చుని ఉంది.

బైరాగి బయటికొచ్చి పొయ్యి ముందు కూర్చుని ఊదుతూ, "పడుకోలేదురా... పొయ్యి ముట్టించి నడుం వాల్చినా," అన్నాడు. పొయ్యిలో చిదుగులు చిటపట మని రాజుకుని సన్నటి పొగ మళ్లీ పైకి లేచింది.

గురిగాడు కూడా బైరాగిలాగే ఇల్లూ, సంసారం లేని మనిషి. అడవి జంతువులను, పిట్టలను వేటాడటం అతని వృత్తి. గురిచూసి పిట్టలను కొట్టడంలో నేర్పరి. అందుకే ఆ పేరు. మాయామర్మం తెలియని మనిషి. రోజుల తరబడి ఎక్కడెక్కడో తిరుగుతూ ఈ నిర్మానుష్య ప్రదేశానికి చాలా తరచుగా వచ్చే అతిథి.

గురిగాడు లోపలికి నడిచి ఒక మూల ముడుచు కుని కూర్చున్న పావురాన్ని చేతిలోకి తీసుకున్నాడు. చాలారోజుల క్రితం అతడే దాన్నిక్కడికి తీసుకొచ్చాడు. తీసుకొచ్చిన రోజే దానిని కోసి వండుదామని చూశాడు. ఆరోజు బైరాగి అడ్డుపడకపోతే అదీపాటికి ప్రాణాలతో ఉండకపోయేది. అది ఎగిరిపోకుండా రెక్కల్లోని ఈకలు మాత్రం పీకి విడిచిపెట్టాడు.

ఇప్పుడు గురిగాడి చేతిలో పావురాన్ని చూసి, "అదేందిరా! ఏంజేస్తుండా?" అన్నాడు. అతడు దూరంగా కూర్చోవడం మూలాన గురిగాడు చేసే పని అతడికి కనబడడం లేదు.

గురిగాడు తన మొలలోంచి సూది దారం తీసు కుంటూ, "దీన్ని తెల్లారి గుళ్లకమ్మకు తీసకబోతండా సావి. ఈ పెంటి ఏ పోతు వెంటా బడిపోకుండ చేస్తన్న. అయినా ఇయ్యన్ని నీకు తెలవవులే. నువ్వు సాము లోరివి కదా," అని వికృతంగా నవ్వాడు.

"తీసుకెళ్లి?" బైరాగి ప్రశ్నార్థకంగా చూశాడు.

"గుళ్లకమ్మొడ్డున వలేస్తుండా సావి. నూకలు జల్లి వలేస్తుండా. దీన్ని వల దగ్గరే కట్టి పడేస్తా. దీన్ని జూసి పిట్టలు దిగాల, వలకి చిక్కాల."

అతడి నవ్వు ఆగకుండా తెరలు తెరలుగా విని పిస్తూ ఉంది. నవ్వుతున్నప్పుడు అతడి పక్కటెముకలు ఎగిరిపడుతూ ఉన్నాయి. మొండిగోడల అవతల నుంచి గుండ్రంటి చంద్రుడు విచారంగా చూస్తున్నాడు.

"ఒరే అది నీకు ఎర పిట్టయితే నాకు పెంచు కున్న పిట్ట. నాకున్న ఒక్కగానొక్క తోడు. తీసుకెళ్లినోడివి తీసుకెళ్లినట్టే మళ్లీ తీసకరా. అది లేకపోతే నాకు పూట గడవదు," అన్నాడు బైరాగి.

బైరాగి మాటలు గురిగాడికి ఆశ్చర్యం కలిగిం చాయి. అతడికి బైరాగి ఒక్కోసారి ఎంతో దగ్గరగా ఉన్నట్లనిపిస్తాడు. ఒక్కోసారి ఎవరితోనూ సంబంధం లేకుండా ఉన్నట్లుంటాడు. బైరాగి చెప్పే ప్రతిదీ అతడికి అద్భుతంగా అనిపిస్తుంది. ఎంత విన్నా ఇంకా ఎన్నో సంగతులు మిగిలే ఉంటాయనిపిస్తుంది.

గురిగాడు మాట్లాడకపోవడం చూసి, "ఏందిరా ఏమైంది గమ్మునుండా?" అన్నాడు బైరాగి.

బైరాగి వంక కాసేపు మౌనంగా చూసి, "చాలా కాలం నుండి నిన్నొకటి అడగాలనుంది సావి," అన్నాడు గురిగాడు.

"ఏందిరా అది?" అన్నాడు బైరాగి వెనక్కి వచ్చి గురిగాడికి ఎదురుగా కూర్చుంటూ.

"నేనే కాదు, నీ గురించి అందరూ అనుకునే ఇసయం ఒకటుంది సావి. మానిక్కెం కూడా అంటా ఉండాడు. ఒక్కోసారి నీలో నువ్వే మాట్లాడుకుంటావు. వేళ్ల మీద లెక్క చేసుకుంటావు. సేతులు చాపుతావు. వెనక్కి లాక్కుంటావు. ఈ పిచ్చిచేష్టలన్నీ నీకెప్పుడొచ్చి నాయి సావీ," అన్నాడు.

గురిగాడి నోటివెంట మాణిక్యం పేరు వింటూనే బైరాగి మొహంలో రంగులు మారాయి.

బైరాగి గురిగాడి దగ్గర ఒకరకంగా ఉంటే మాణిక్యం దగ్గర మరోలా ఉండేవాడు. మాణిక్యంతో అతడికి మాటలు తక్కువ. వాళ్లిద్దరిలో- ఒకరు ఉన్న ప్పుడు మరొకరు ఉండేవారు కాదు. ఒక్కోసారి అతిథు లిద్దరూ ఒకేసారి రావడం జరిగేది. అలాంటి సమయాల్లో బైరాగి మొహంలో భావాలను చదవడం కష్టం. అతడు తెగ ఇబ్బంది పడేవాడు. వచ్చిన అతిథులిద్దరూ కూడా ఒకరితో ఒకరు ఎక్కువ మాట్లాడకుండా ముభావంగా ఉండేవారు. ఇద్దరి మధ్య పొసిగిన సాంగత్యం ముగ్గురి మధ్య పొసిగేది కాదు.

'ఈ పూసలోడితో బైరాగికి స్నేహమేమిటబ్బా,' అనుకునేవాడు గురిగాడు. మాణిక్యం బైరాగిలది తనకు తెలియని గత పరిచయమని అనుకునేవాడు.

గురిగాడి చేతిలో పావురాన్ని చూస్తూ, "ఈ పావు రాన్ని చూస్తుంటే నాకొక స్వామి గుర్తుకొస్తున్నాడురా," అన్నాడు బైరాగి సంభాషణ మారుస్తూ.

"ఎవరు సావి," అన్నాడు గురిగాడు ఒక చేతిలోని సూదిలోకి మరో చేతిలోని దారాన్ని ఎక్కిస్తూ. అతడి తీక్షణమైన చూపు సూదిబెజ్జం మీదుంటే అతడి చెవులు బైరాగి మాటలను శ్రద్ధగా వింటున్నాయి. వాకిలి

ముందు పొయ్యిలో నిప్పులు రాజుకుంటూ మూకుడు చుట్టూ మంటలు నాలుకలు చాపుతున్నాయి. పొయ్యి మీద అన్నం కుతకుత ఉడుకుతున్నట్లు శబ్దం రాసాగింది.

"నేను ఇల్లిడిచి దేశాలు పట్టినప్పుడు తలకోనలో ఒక సావి కలిశాడురా. నాకంటే పెద్దమనిషిలే. దాదాపు ఆయనే నా గురువనుకో. ఆయనెప్పుడూ ఒక మాట చెప్పేవాడు. మనుషులు తమకు తెలిసినా తెలియకున్నా మంచీ చేస్తారు, చెడూ చేస్తారు. కార్యం కంటి ముందున్నంత వరకే. చేతులు దాటాక అన్నీ మనమనుకున్నట్టే జరగవు. దేని దిశ దానికే ఉంటుంది. రెక్కలిప్పుకున్న పావురం ఎగిరినట్టు దేని దిక్కు అది ఎగిరిపోద్ది. గాలికి పుట్టిన అల సముద్రంలో కనిపించనంత దూరం కొట్టుకుపోయినట్టు అది ఎటో ఎళ్లిపోద్ది..."

బైరాగి మాట్లాడుతున్నంతసేపూ అతడేదో ధ్యానంలో ఉన్నట్లు కళ్లు శూన్యంలోకి తెరుచుకుని ఉన్నాయి. అతడి చేతులు పక్షవాతం వచ్చినట్టుగా నిశ్చలంగా పడి ఉన్నాయి.

బైరాగి చెప్పిందంతా విన్న తరువాత గురిగాడు నెమ్మదిగా లేచి నుంచుని పావురాన్ని ఎక్కడ నుంచి తెచ్చాడో ఆ గదిలోనే విడిచిపెట్టి బయటకు నడుస్తూ, "నువ్వేం చెబతన్నవో నాకు తెలవదు సావి. నాకు తెలిసిందల్లా ఎలకల్ని, ఎంటవల్ని, పిట్టల్ని కొట్టి తినడం... తొంగోవడం," అన్నాడు పెద్దగా నవ్వుతా. బైరాగి కొద్దిసేపు మౌనంగా ఉండి, తర్వాత తను కూడా గురిగాడితో కలిసి నవ్వసాగాడు.

చివరికి గురిగాడు కొంగల్ని భుజానేసుకుని ఎక్కడికో పోవడం  చూసి, "మళ్లేడికి పోతన్నావురా? వంటజేస్తిని కాస్త తిని పో," అన్నాడు బైరాగి పొయ్యి మీద మూకుడులో పుల్లపెట్టి తిప్పుతూ.

"నేను తినే వచ్చాను సావి. నువ్వు కానీ. నేను మల్లొస్తా. ఎంత రేత్రికైనా వస్తాను. నువ్వు పొనుకో నాకోసం చూడబాకు," అని వెన్నెల్లో దట్టమైన చెట్ల మధ్య నీడలలో కలిసిపోయాడు. అతడు రాత్రంతా కల్లుపాకలో గడిపి ఏ తెల్లవారుఝామునో తిరిగొస్తాడు.

ఆ తరువాత చాలాసేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది. ప్రతిరోజులాగానే బైరాగి బయట అరుగు మీద చికిలించిన కళ్లతో శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడు. అలా ఎంతసేపు గడిచిందో తెలియదు. కొంతసేపటికి లోపలికి వచ్చి కాసేపు గదిలో అటూ ఇటూ తిరిగి చివరికి అన్నం తిని నేలమీద పడుకుని నిద్రలోకి వెళ్లిపోయాడు. దీగుడు దీపం కాసేపు నిశ్శబ్దంగా వెలిగి చివరకు చీకట్లో అంతర్ధానమైంది. ఎక్కడో గది మూల నుంచి కీచురాయి ఒకటి పిలుస్తూ ఉంది. బయట కుంటలో కప్పలు బెకబెక మంటున్నాయి.

మధ్యరాత్రి కావచ్చు, "బిచ్చపతీ... ఉండావా," అని బయటి నుంచి ఎవరో పిలవడంతో, "ఎవురది?" అంటూ బైరాగి పడుకునే అడిగాడు.

"నేను... మానిక్కాన్ని..." అని అవతలి నుంచి సమాధానం వచ్చింది.

"మానిక్కెం... లోపలికి రా..." అంటూ బైరాగి పడుకున్నవాడు కాస్తా లేచి బయటకు నడిచాడు.

ఆరుబయట మసకవెన్నెల్లో నుంచుని ఉన్నాడు మాణిక్యం. సన్నటి బక్క పలచటి మనిషి. కనపడీ కనపడని చెవిపోగు, మెడలో పూసలదండ. మాణిక్యం వెనక భుజం చుట్టూ కొంగు కప్పుకున్న ఆడమనిషి. అస్పష్టంగా కనిపించీ కనిపించని మొహం.

"ఈ మనిషెవురు?" బైరాగి వెనక్కి తిరిగి నడుస్తూ అన్నాడు.

"మావోళ్లే," చెప్పాడు మాణిక్యం బైరాగి వెనకే వస్తూ.

మాణిక్యం అప్పుడప్పుడు అక్కడికి ఒక ఆడ మనిషిని వెంటపెట్టుకుని వస్తాడు. అయితే అతడితో ఒకసారి కనిపించినవారు మళ్లీ కనిపించేవారు కాదు.

"ఇయ్యాల గురిగాడు రాలేదా?" వెనక నుంచి మాణిక్యం ప్రశ్న.

"ఇప్పుడే బయటకెళ్లాడు. నడిరేత్రికిగాని రానన్నాడు," ముళ్లకంపలని దాటుకుని ఒకరి తరువాత ఒకరు లోపలికి అడుగుపెట్టారు.

బైరాగి చేరగిలబడుతూ, "మీరు బువ్వ తిన్నారా. సంచిలో నూకలున్నాయి. కావలిస్తే వండుకోండి," అన్నాడు. వాళ్లిద్దరూ చిరిగిన చాప మీద కూర్చున్నారు.

మాణిక్యం బీడీ ముట్టించి గుప్పుమని పొగ వదులుతూ, "తినే వచ్చాం సావి. ఈ రేత్రికి ఇక్కడే ఉండి పొద్దున్నే పోతాం," అన్నాడు.

మాణిక్యం చెప్పేది వింటూ బైరాగి ఆమె వంక చూశాడు. నేలకు ఆనించి కూర్చున్న మట్టిగాజుల చేతులు. పాపిట చెదిరిన ముంగురులు. ఏ భావమూ చెప్పని అమాయకమైన కళ్లు. కనిపించీ కనిపించని రంగుపూసల దండ. ఏ కాలం నాటిదో తెలియని ముదురు మట్టిరంగు చీర. చీర మడతల కింద కోమలమైన పాదాలు.

బైరాగి ఆ పాదాల నుంచి చటుక్కున చూపు మరల్చి తనలో తాను, 'ఈ యమ్మి అలసట చేత ఇలా ఉంది కాని ఈ యమ్మి ఈ యమ్మి కాదు,' అను కున్నాడు. మెడ వంకరగా పెట్టి ఏదీ ఆలోచించకుండా ఎటో చూస్తూ మళ్లీ తనలో, 'ఈ యమ్మి ఇక్కడికి రావాల్సిన మనిషి కాదు,' అని గొణుక్కుని, 'ఎందుకిలా?' అనుకుని మళ్లీ ఆమె వైపు దృష్టి మరల్చాడు.

ఆమె చాలా దూరం ప్రయాణం చేసివచ్చినట్టుగా చేతిలో ఉన్న ప్లాస్టిక్ సంచి రంగు వెలిసి చేతిపట్టుకూ, చెమటకీ ముడతలు పడి ఉంది. 'సందేహం లేదు. ఈ యమ్మి తలకీ పాదాలకీ సంబంధం లేనట్టుగానే ఈ యమ్మి గతానికీ వర్తమానానికీ పొంతన లేదు,' అను కున్నాడు బైరాగి మనసులో.

అంతక్రితం మాణిక్యంతో వచ్చిన ఆడవాళ్లు బైరాగితో పరాచికాలాడబోయేవారు. మాణిక్యం గురించి తమకంతా తెలిసినట్టే ప్రవర్తించేవారు.

'వాళ్లకు, ఈ యమ్మికి ఏమిటి తేడా?' అను కున్నాడు బైరాగి.

'వాళ్లు మానిక్యాన్ని నమ్మలేదు. ఈ యమ్మి పూర్తిగా వాడిని నమ్ముతున్నట్లుంది. ఇంతకుముందు మానిక్కెంతో వచ్చిన ఆడవాళ్ల మాదిరి కాదీయమ్మి.'

ఆమె కూలిన గోడల నుంచి చొచ్చుకొచ్చిన జిల్లేడు కొమ్మలను, గదిలో చిందర వందరగా పడేసిన వస్తువులను వెన్నెల వెలుగులో వింతగా చూస్తూ కూర్చుంది. నిద్ర ముంచుకు వస్తోంది కాబోలు. వాళ్ల మధ్య మాటలు తగ్గుతూ మాటల మధ్య ఎడం పెరుగుతూ ఉంది. బైరాగి ఆవులించి కాళ్లు బార జాపి అక్కడే నేలమీదకు ఒరిగాడు. అతడిలో క్రమక్రమంగా అసహనం పెరుగుతూ ఉంది. తలనిండా ఎడతెరిపి లేని ఆలోచనలు.

కళ్ల ముందు ఆమె అమాయకమైన రూపమే కనపడుతోంది. అతడు బాధగా నిట్టూర్చాడు. అతడి హృదయం ఆందోళనతో కొట్టుకుంటూ ఉంది.

'ఈయమ్మి ఒంటరిగా దొరికితే ఈ మానిక్యాన్ని నమ్మొద్దనీ, వాడి నుంచి పారిపొమ్మనీ చెప్పాలి,' అను కున్నాడు.

'చెబితే నమ్మిద్దా...?'

'నమ్మదు,' అతడు నిశ్చయంగా తనలో అను కున్నాడు.

'మరి నమ్మేట్టు చేయాలంటే ఎలా?' అతడికేం పాలుపోలేదు. 'నమ్మి వచ్చిన మడిసి. మాయలో వున్న మడిసి. మైకంలో పడ్డ మడిసికి ఏం చెప్పినా తెలవదు.'

బైరాగి ఆలోచనలో ఉండగానే చీకటికి అవతలి వైపు నుంచి గుసగుసలు వినిపించాయి. మాణిక్యం ఆమెకు దగ్గరగా జరిగినట్లున్నాడు.

ఆమె చిన్నగా మాట్లాడుతూ ఉంది. ''నీకు తెలవదా. రెండు దినాల నుండి నిద్దర్లేదు. జెరమని కని కరం కూడా లేని మడిసివి నువ్వు.''

బదులుగా మాణిక్యం నవ్వు.

బైరాగి ఇటు తిరిగి చీకట్లో కళ్లు తెరిచాడు.

బైరాగి కదలికకి మాణిక్యం లేచి కూర్చుని నిట్టూర్చి, ''పడుకున్నావా బిచ్చపతీ,'' అన్నాడు.

బైరాగి లేదని సమాధానం చెప్పాడు.

మాణిక్యం బయటకు వెళ్లి అరుగు మీద కూర్చుని అగ్గిపుల్ల ముట్టించాడు. ఆరు బయట పసుపు రంగు వెన్నెల. బైరాగి లేచి తనూ బయటకు నడిచాడు.

మాణిక్యం గుప్పుగుప్పుమని పొగ పీలుస్తూ బీడీ తాగుతున్నాడు. ఉన్నట్టుండి బైరాగి ఏదో చెప్పడాని కన్నట్టు గాలిలో చెయ్యి పైకి లేపి ఎందుకనో ఒక్కక్షణం ఆగి తన చేతివేళ్ల వంక చూస్తుండిపోయాడు.

మాణిక్యంతో బైరాగి ఎప్పుడూ ఎక్కువ మాట్లాడడు. కళ్లతో చూస్తూ వినేదే ఎక్కువ. తన దగ్గరకు వచ్చే పరిచితులకైనా, అపరిచితులకైనా అతనెప్పుడూ లోబడి ఉండే మనిషి కాడు. ఎప్పుడూ ఎవరికీ దేనికీ లొంగని మనిషి. చివరికి ప్రాధేయపడుతున్నట్టుగా అడిగాడు.

''ఇడిసిపెట్టు మానిక్కెం. ఆ యమ్మి అసుమంటి మడిసి కాదు.''

బైరాగి చెప్పినదేమిటో ఒక్కక్షణం పాటు మాణిక్యానికి అర్థంకాలేదు. అర్థమయ్యాక బైరాగి వంక విచిత్రంగా చూసాడు.

''ఆ యమ్మి అసుమంటిది కాదని నీకెట్లా తెలుసు, నీవెరుగుదువా?'' మాణిక్యం నోట్లో బీడీ తాలూకు ఎర్రటి నిప్పు సన్నటి పొగని విడుస్తూ ఉంది.

''నేనెరగను,'' బైరాగి సమాధానం.

''మరి నీకెట్టా తెలుసు.''

బైరాగి తల వంచుకుని కాసేపు మౌనంగా ఉండి చివరికి, ''ఆ యమ్మి పాదాలు చూసిన. నువ్వను కునే మడిసి మాత్రం కాదని చెప్పగలను,'' అన్నాడు.

మాణిక్యం ఒకసారి బైరాగి వంక సూటిగా చూసి నవ్వి, ''నువ్వు కాళ్లు చూసి తలెంటికలు లెక్కపెట్టగల వోడివని నాకు తెలుసు. నువ్వన్నది నిజమే సావి. ఈ పిట్ట కోసం నేను పడని యాతన లేదు. ఇప్పుడిడిసి పెట్టడం జరిగేపని కాదు,'' అన్నాడు.

వాళ్లు మాటల్లో పడి చెట్ల మధ్య నుంచి చాలా దూరం నడుచుకుంటూ వచ్చి, తిరిగి వెనక్కి మళ్లి వాకిలి ముందు బయట అరుగుమీద కూర్చున్నారు. మాణిక్యం తనెంత కష్టపడి ఆమెను వలేసి పట్టుకుందీ చెప్పుకుపోతున్నాడు.

బైరాగి ఏదో నిశ్చయించుకున్నవాడిలా లేచి, ''కాసిన్ని నీళ్లు తాగొస్తా మానిక్కెం. దప్పిగ్గా ఉంది,'' అన్నాడు లోపలికి నడుస్తూ.

మాణిక్యం ఏం మాట్లాడలేదు. బైరాగి లోపలికి నడుస్తూ గుమ్మం దగ్గరే నుంచుండిపోయాడు. చీకటి నీడల మధ్య చెట్ల కొమ్మలు దిగులుగా చూస్తున్నాయి. నేల మీద ఆకుల నీడలు గాలికి కలగాపులగంగా కదులుతూ ఉన్నాయి. కాసేపు నుంచున్నాక నిట్టూర్చి లోపలికి చిన్నగా శబ్దం లేకుండా అడుగు పెట్టాడు బైరాగి.

అప్పటిదాకా గీమంటున్న కీచురాయి గదిలోపల అలికిడికి ఒక్కసారిగా గమ్మునైపోయింది. గుమ్మం లోంచి గది లోపలికి బారుగా సాగిన నీడను చూసి మెలకువతో ఉన్న ఆమె చటుక్కున లేచి కూర్చుంది.

లోపలికి వచ్చిన బైరాగి మరికొంచెం ముందుకు వచ్చి నీళ్లు ముంచుకోబోతున్నట్లు మట్టికుండ మీద మూత తీసి మళ్లీ పెట్టి ముందుకి కదిలాడు. తరువాత నిశ్శబ్దం. కీచురాయి కూడా ఏం జరగబోతోందో అని తీక్షణంగా ఎదురుచూస్తున్నట్లు నిశ్శబ్దం.

''ఏంది సామి ఇది,'' వినీవినబడని ఆమె లో గొంతుక. కుండలో నీళ్ల కదలిక. భగభగమని చీకటిని పెకలిస్తున్న రెండు దీపాలు. కాటుక కళ్లు.

ఆమె కళ్ల కెదురుగా బైరాగి మసకమసకగా కనిపించాడు. ఆ క్షణంలో అతడి ఒంటి మీద ఎప్పుడూ ఉండే వస్త్రం లేదు. జుట్టు ముడివీడి భుజాలపై పొడవాటి వెంట్రుకలు వేలాడుతున్నాయి. అతడి కళ్లు ఎవరో మంత్రించినట్లుగా లోపలి శూన్యంలోకి చూస్తూ అంధ భిక్షువులా ఉన్నాడు. అతడేదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నట్టు అతడి పెదాలు పళ్ల బిగువున తెరుచుకున్నాయి.

''మానిక్కెమే నీ దగ్గరకు వెళ్లమని చెప్పాడు.''

ఆమె ఒణుకుతూనే రెండు చేతులూ జోడించింది.

''నేనసుమంటిదాన్ని కాను సావి.''

''నాకు తె...'' అనబోయి మరుక్షణం వెనక నుంచి మాణిక్యం కట్టెతో కొట్టడంతో బైరాగి ముందుకు తూలిపడి బాధగా అరిచాడు. అతడలా రెండు చేతులతో తల పట్టుకుని ముందుకు పడిన మరుక్షణం ఆమె లేచి ఒణుకుతున్న చేతులతో గబగబ తన గుడ్డల సంచిని తీసుకుని ఊడ తీసిన కిటికీ గోడ దూకి చీకట్లో చెట్ల మధ్య కలిసిపోయింది.

మాణిక్యం ముందుకు కూలబడిన బైరాగి వీపు మీద కాలేసి అతడి పెడరెక్కలు విరిచి పట్టుకున్నాడు. అతడు బక్కగా ఉన్నా బలంగా ఉంటాడు. బైరాగి నోటి వెంట నరాలను మెలిపెడుతున్న మూలుగు. ద్వంద్వ యుద్ధం చేస్తున్న ఇద్దరు మనుషుల నీడలను నివ్వెరపోయి చూస్తూ, పున్నమిచంద్రుడు తెల్లటి మబ్బుల చాటు నుంచి ఆతృతగా పైపైకి వస్తున్నాడు.

''ఆ యమ్మికేం జెప్పినావు నువ్వు,'' బైరాగి చేతుల్ని మెలితిప్పుతూ అడిగాడు మాణిక్యం.

''నాకు తెలవదు,'' అని భారంగా మూలిగాడు బైరాగి. బైరాగి అర్ధనగ్న దేహం అస్తవ్యస్తంగా నేలమీద పడి ఉంది. పొడవాటి అతడి జుట్టు కొప్పు విడివడి వెంట్రుకలు చెమటతో కలిసి ధారలు కట్టి ఉంది.

''మరెందుకు పారిపోయింది?'' మాణిక్యం గొంతు కటువుగా ఉంది.

బైరాగి పక్కకు తిరిగి విదిలించుకోవడంతో మాణిక్యం కిందపడ్డాడు. వాళ్లిద్దరూ దొర్లుకుంటూ పావురం ఉన్న చోటుకి వచ్చిపడ్డారు. అది బెదిరి రెక్కలు టపటపమని కొట్టుకుని ఒక్క ఉదుటున గాలిలోకి లేచింది.

పావురం రెక్కలు టపటపమని కొట్టుకుంటూ గాలిలోకి ఎగిరిన మరుక్షణం, ''ఎవురా మడిసి?'' అన్న గురిగాడి గొంతు వినిపించింది. చెట్ల మధ్య నుండి నడిచొస్తున్న గురిగాడు మాణిక్యాన్ని చూసి నవ్వి, ''మానిక్కెమా... సావిని మరియాదగా ఇడిసి పెట్టు,'' అన్నాడు.

ఆ సమయంలో మాణిక్యాన్ని చూసి అతడొక్కడే అలా నవ్వగలడు. వారిద్దరి వైరం అలాంటిది. ఇద్దరు మనుషులను అవలీలగా ఎత్తి పారేయగల బలిష్టమైన మనిషి.

గురిగాడి అరుపు వినగానే మాణిక్యం గోడ మీద నుంచి దూకి పారిపోయాడు. గురిగాడు మాణిక్యం వెంటపడబోయి ఆగి వెనక్కొచ్చి బైరాగిని పైకి లేపి, ''ఏంది సావి ఇది,'' అనడిగాడు.

''అంతా మంచే జరిగిందిరా. అంతా అనుకున్నట్టే జరిగింది,'' బైరాగికి అలుపు తగ్గడం లేదు. అతడి శరీరం స్వాధీనంలోకి రాక లేచి కూర్చోలేకపోయాడు.

"అసలేం జరిగింది సావి?" అంటూ గురిగాడు నేలమీద కూర్చుని బైరాగిని ఒళ్లోకి తీసుకున్నాడు. ఆ స్థితిలో బైరాగిని చూసి అతడి గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

రెక్కలు తెగి నేలకొరిగిన జటాయువులా ఒగరుస్తూ కలవరిస్తున్నాడతను.

"ఏమీ తెలియని అమాయకపక్షి... ఇది మంచి, ఇది చెడు అని ఎట్టా చెప్పేదిరా? ఆడతా పాడతా ఎగిరే పిట్టని కట్టిపడేయడం గాదా? మానిక్కెం అసుమంటోడని ఆయమ్మికెలా చెప్పేది చెప్పు. అలా చెప్తే ఆమెకెలా తెలుసుద్ది చెప్పు. చెప్పినా మైకంలో పడ్డ మడిసి నా మాట నమ్మిద్దా... ఆయమ్మికి మానిక్కెం సంగతి తెలవదు. ఆడి నించి కాపాడేందుకు ఆ పని చేసిన..."

ఏం జరిగిందో గురిగాడికి కొంచెం కొంచెం అర్థమవుతూ ఉంది.

బైరాగి నేలకొరిగే ఉన్నాడు. ఇద్దరి మధ్యా కాస్సేపు నిశ్శబ్దం.

ఉన్నట్టుండి గురిగాడు ఏదో గుర్తుకు వచ్చినట్లు లేచి లోపలికి వెళ్లాడు.

"ఇక్కడ పావురమేది సావి?"

"రెక్కల్దీసిన పిట్ట. యాడికి బోద్ది ఇక్కడే ఎక్కడో ఉంటది చూడరా..." అన్నాడు బైరాగి పడుకునే.

"ఈకలు మొలుచుంటాయి సావి. నేను చూసుకోలేదు."

"ఎటన్నా ఎగిరిపోయిందేమోరా."

"ఎల్లిపోయిందని కాదు సావి నా బాధ. దాని కళ్లు కుట్టేసిన," అతను గొంతుక్కేదో అడ్డం పడినట్లు చెప్పాడు.

"కళ్లు కుట్టేసినావా?" బైరాగి నిర్ఘాంతపోయి లేచి కూర్చున్నాడు.

"అవును సావి. కుట్టకపోతే ఎట్టా కుదుర్ది చెప్పు. వేటకు ఇడిసిన పిట్ట జతగాడిని చూసుకుని ఎగిరిపోదా. అందుకనే దానికి చూపు లేకుండా రెప్పలు సూద్దారంతో కుట్టేసినా సావి." అతడు పావురం కోసం వెతుకుతూ గదిలోని వస్తువులన్నిటినీ చిందరవందరగా విసిరేయసాగాడు.

బైరాగి నిశ్చలంగా నేలచూపులు చూస్తూ కూర్చున్నాడు. గురిగాడు వెతికి వెతికి ఎటూ పాలుపోక నేల మీద చతికిలబడి ఎగిరిపోయిన పావురం గురించి ఆలోచిస్తూ, 'దానికి కళ్లు కుట్టకుండా ఉంటే ఎంత బాగుండును,' అని కాసేపు తనలో తను మథనపడి చివరికి అది ఎక్కడికి వెళ్తుంది అని చీకట్లోకి చూశాడు. కళ్లు కుట్టేసినట్లు ఒకటే చీకటి. ఆ చీకటికి అంతులేదు.

అప్పుడతనికి చీకట్లో కలిసిపోయిన ఆడమనిషి గుర్తొచ్చి, "తప్పు జేసినావేమో సావి," అన్నాడు.

బైరాగి అర్థం కానట్టు చూశాడు.

"ఆ యమ్మితో బోతే మానిక్కెమే మారేవోడేమో. నువ్వు జెప్తవు గదయ్యా నిన్నటి మడిసి ఇయ్యాల మడిసిగాడని, మడిసి మారతానే ఉంటాడని... అసలాడు మారినాకే ఈడికి వచ్చినాడేమో ఎవురికి తెలుసు... మానిక్కాన్ని నమ్మనీకుండా జేసినావు సరే... ఆ యమ్మి లోకంలో ఎవుర్నీ నమ్మకుండా జేసినావు గదా... ఎంత పని జేస్తివి సావీ," అన్నాడు గురిగాడు.

గురిగాడు ఏం చెప్తున్నాడో బైరాగికి మొదట అర్థం కాలేదు. కొంచెం కొంచెంగా అర్థమయ్యాక బైరాగి నోట మాట పడిపోయినవాడిలా చేష్టలుడిగిపోయాడు. ఇది ఇప్పటిదాకా తన అనుభవంలోకి రాని ఆలోచన. ఇలాంటి సత్యాన్ని గురిగాడు చెప్పగలడని తనిప్పటి దాకా కలలో కూడా ఊహించి ఉండడు. బైరాగికి లోపల ఏదో కరిగినట్లయింది. మెరుస్తున్న కళ్లతో అతడు పరిపూర్ణంగా గురిగాడివైపు చూశాడు.

అయితే గురిగాడి ఆలోచన ఇంకెటో ఉంది. ఇలా జరగకుంటే బాగుండును కదా... అనుకుంటూ తనకు తెలియకుండానే తన వేళ్లవంక చూసుకుంటూ... చేతులు చాపి... జరిగింది తల్చుకుని... గభాల్న చేతుల్ని వెనక్కి లాక్కుని ఒక్కసారిగా గట్టిగా నవ్వాడు.

బైరాగికి ఆ నవ్వు అంతకుముందులా వికృతంగా అనిపించలేదు. గురిగాడు తనెప్పుడూ చూడని కొత్త మనిషిలా అనిపించాడు.

పైన ఆకాశంలో నల్లటి మబ్బుతరగల మాటున చంద్రుడు కొలిమిలో బొగ్గుల మధ్య నిప్పుకణికలా ఉన్నాడు. చెట్ల ఆకుల్లోకి చొచ్చుకు వస్తున్న వెన్నెల చీకటిని విరుచుకు తింటూ ఉంది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 2 ఆగస్టు 2009*

